# నీవు నేర్పిన విద్యయే

నలభై దాటిన వయసు, చేతులకి ఉంగరాలు, తెల్లటి, గంజిపెట్టి, యిస్త్రీ చేసిన లాల్చి. అంతకన్నా తెల్లటి పైజామా, దానికన్నా తెల్లగా ఉన్న మడత పెట్టిన అత్తా కోడళ్ళంచు కండువా, వాటి వెనకాల దాక్కున్న నల్లని శరీరం. అతని పేరు మల్లిఖార్జున్.

చందనం అద్ది, దానిమీద కుంకుమ దిద్ది, అద్దంలో తన ప్రతిబింబాన్ని అన్ని కోణాల్లోంచి చూసుకుంటున్నాడు మల్లిఖార్జున్. మల్లిఖార్జున్ సెల్ఫ్‌మేడ్ మాన్, 'కష్టపడి పైకొచ్చాను.' అని అందరి దగ్గరా అంటాడు.

నాలుగో క్లాసునుంచే పులిహోర, బిర్యాన్ని పొట్లాలకోస్ ఊరేగింపుల్లోకి వెళ్ళాడు. రాజకీయాల్లోకి రావడానికి మొదటి మెట్టన్నమాట.

ఆ తర్వాత కొంచెం పెద్దయ్యాకా, ఆ ఊరూ, ఈ ఊరూ వెళ్ళేందుకు లారీల్లో కూచునే హోదా వచ్చేసింది. చదువుకోడానికి పెద్ద యిష్టం చూపలేదు.

ఏడో క్లాసువరకూ స్కూలు వాళ్ళే ఈడ్చారు. ఆ తర్వాత ఇద్దరికీ సాధ్యం కాలేదు. స్కూలు మానేశాడు. కార్యక్రమాలు... ప్రజా కార్యక్రమాలు మరోటి... అంటూ వాటిల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఫుల్ టైం రాజకీయాల్లోకి దిగాడు.

దిష్టి బొమ్మలు తయారుచేయ్యడం, నాలుగు రోడ్ల కూడలిలో అంటించడం లాంటి స్థాయికి ఎదిగిపోయాడు.

గుడిసెలు పీకించడం, వేయించడం, దెబ్బలాటల్లో ముందుండటం లాంటి ప్రమోషన్‌లు కొట్టేశాడు.

మొదట్లో అంటే చిన్నప్పుడు అధికార పార్టీకి పనిచేస్తే 'సమూరాయ్' యిచ్చారు. ఆ తర్వాత అన్ని పార్టీలకి పనిచేసాడు. జనాన్ని పోగుచెయ్యడానికి, మీటింగ్‌లున్న ఊళ్ళకి తీసుకెళ్ళేవాడు. ప్రస్తుతం ఒకే పార్టీని నమ్ముకున్నాడు. వీళ్ళు చాలానే యిచ్చారు.

అస్మదీయులు లౌక్యుడన్నారు, తస్మదీయులు మోస గాడన్నారు. ఏదైనాకానీ పార్టీలో మంచి ఎఫీషిమెంట్ 'వర్కర్‌గా పేరు సంపాదించుకున్నాడు.

కాబినెట్‌లో సంఖ్య పెంచుతారు, నీ పేరు వినపడ్తోందని ఆ నోటా ఈ నోటా విన్నాకా, మినిష్టర్ అయిపోయినంత ఉత్సాహంలో ఉన్నాడు. కోట్లు ఎడాపెడా సంపాదిస్తే, చర్లపల్లి ఫ్యాక్టరీని పెద్దగా చేసి ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న సంతోష్‌కి బర్త్‌డే గిఫ్ట్‌గా యిచ్చేస్తే... ఆ తర్వాత ఏ స్కాంల్లో ఎంత కూరుకుపోయినా పెద్ద నష్టం లేదు. ఈ ఆలోచనల్లో మునిగి తేలిపోతున్నాడు మల్లిఖార్జున్.

ప్రస్తుతం సత్తాలో ఉన్న పార్టీ హైకమాండ్ వరకు మల్లిఖార్జున్ పేరు పాకింది. పార్టీ అధ్యక్షుడు రాజధాని వెళ్తున్నాడు. ఇదివరకే చాలాసార్లు చెప్పాడు. మరోసారి పార్టీ అధ్యక్షుణ్ణి కలిసే పని మీదున్నాడు. తన పేరు రికమెండ్ చేసి ఏదో ఒక పోస్ట్ వచ్చేటట్లు చెయ్యమని చెప్పడానికే బయల్దేరుతున్నాడు.

ఇంట్లోంచి బయటకొచ్చే ప్రయత్నంలో ఉండగానే ఫోన్ మోగింది.

రాజు ఫోన్ తీసాడు.

రాజు మల్లిఖార్జున్‌కి అన్నీ, డ్రైవరు, పి.ఏ., ఫ్రెండ్, చుట్టం, ఆల్‌ఇన్‌వన్.

రాజు బయటకు రాబోతున్నాడు.

ఎవరి ఫోనో కనుక్కోవడం కోసం లోపలికి పోబోతున్నాడు మల్లిఖార్జున్.

ఎవరిదన్నట్లు చెయ్యితో సైగ చేశాడు, ఎదురొచ్చిన రాజుతో. ఆందోళనగా చేతికిచ్చాడు. "సంతోష్‌బాబు దోస్త్..." అంటూ 'హలో' అన్నాడు.

"మీరు సంతోష్ డాడీయా?"

"అవును బాబూ, ఏంది?"

"అంకుల్ నేను సంతోష్ ఫ్రెండ్‌ని నవీన్ మాట్లాడుతున్నా, సంతోష్‌కి యాక్సిడెంట్ అయింది... లే...బర్రె... ఈడనే... ఏ.యస్. రావ్‌నగర్ దాటినంక... మీద మోటార్ సైకిల్ పడింది.... గాంధీకి తీస్కపొమ్మని యిక్కడ చెప్తే తీస్కపోతున్న... నాచారంలో ఉన్నం, నాకు ఎక్కువ తగలలేదు... మీరు

గాంధీకి రండి. నేను చాలాసార్లు మీయింటికి వచ్చాను..." అంటూ భయంగా మాట్లాడుతూనే సమాచారం అందించి ఫోన్ పెట్టేశాడు నవీన్.

"బాగ్గేం!" గట్టిగా పిలిచాడు.

మల్లిఖార్జున్ భార్య భాగ్యలక్ష్మి ఎక్కడికో వెళ్ళడానికి తయారయింది. పెద్ద జరీ చీర... ఒంటినిండా నగలు.

"ఏందీ! ఏమాయే!" అంతే గాబరాగా అంది.

"మన సంతోష్‌కి యాక్సిడెంట్ అయిందంట, గాంధీకి తీస్కపోతా, మధ్యలో నాచారంకెల్లి ఫోన్ ఛేసిండు. నవీనంట..."

"నిజమా!" ఆందోళనగా అంది.

"ఇల్లాంటిది అపద్దాలు చెప్తారా! జల్ది దా! గాంధీకి పోదాం"

"నాబాబో! ఓ సంతోసో!" అంటూ గట్టిగా రాగం పెడ్తూ కార్లో కూచుంది భాగ్యలక్ష్మి.

రాజు డ్రైవ్ చేస్తున్నాడు.

మల్లిఖార్జున్ గంభీరంగా ఉన్నాడు.

ఏదో గుర్తొచ్చినట్లు సెల్ తీసి నంబర్లు టకటకా నొక్కేసాడు.

"గణేష్! సంతోష్‌కి యాక్సిడెంట్ అయింది. గాంధీకి రా!" కవితకు ఫోన్ చేసి రమ్మను." అంది భాగ్యలక్ష్మి ఏడుపు ఆపి.

"కవిత, దగ్గర బంధువుల్లో ఉన్న ఏకైక డాక్టరు. ఎవరింట్లో ఏమైనా కవితని తప్పకుండా పిలుస్తారు. ప్రైవేటు ప్రాక్టీసు కాబట్టి, బంధువుల్ని నిరాశపర్చకుండా ఎవరుపిల్చిన వెంటనే వచ్చేస్తుంది.

కవితకి కూడా ఫోన్ చేసాడు.

మరో గంటకి గాంధి చేరుకున్నారు.

"రోడ్లన్నీ రష్. పైగా ఆఫీసు టైముకూడా... అరగంటలో చేరాల్సిన దాన్ని, ముప్పావు గంట పట్టింది." కవిత వీళ్ళ కన్నా ముందే వచ్చింది, వీళ్ళని చూడగానే అంది.

ఈ లోపల నవీన్ వచ్చాడు వీళ్ళ దగ్గరికి.

"ఎక్కడున్నాడు?" అంటూ అంతా నవీన్‌ని చుట్టుముట్టారు.

"మామూలుగా లేడు. ఏందో ఎవరూ కనపడడం లేదు..." అని అన్నాడు. గణేశ్ కూడా అప్పుడే వచ్చి వాళ్ళని చేరుకున్నాడు.

"డాక్టర్లంతా సమ్మె చేస్తున్నారంట! లోపల సంతోష్‌ని చూడనీకి ఎవరూ రాలేదు. ఎవరూ లేరు..." అన్నాడు నవీన్.

ఒక్కక్షణం నడక ఆపేసారు అందరు.

"నేను చూస్తాను. లోపల ఎవరైనా కనపడ్తే, తీసుకొస్తాను" అంటూ కవిత అక్కణ్ణించి వెళ్ళింది.

నిశ్శబ్ధంగా ఉన్న ఆ గదిలో స్ట్రెచర్ మీద అచేతనంగా రక్తం కారిపోతున్న శరీరంతో పడివున్నాడు.

గొల్లుమంది భాగ్యలక్ష్మి.

"అక్కా! ఊకో!" అంటూ ఆమె భుజం మీద చెయ్యేసి నొక్కాడు గణేష్.

"ఎట్ల! ఏం చెయ్యాలా! ఈ డాక్టర్లు కూడా ఇప్పుణ్ణే సమ్మె చెయ్యాలా! బిడ్డకేమయినా అయితే..." అంటూ మళ్ళా గొల్లుమంది.

"నేనిట్లాబోయి ఏ డాక్టరయినా దొరుకుతడేమో చూస్తా" అంటూ గణేష్ కదిలాడు.

అప్పుడే ఓ తెల్లకోటు వేసుకున్న ఓ మనిషి వాళ్ళవైపుగా వచ్చాడు.

మల్లిఖార్జున్ ఆ మనిషిని... కాదు... ఆ డాక్టర్ని చూసాడిది వరకే. ఎక్కడో కాదు... ఇక్కడే... ఇదే హాస్పిటల్‌లో.

ఐదారు నెలల క్రితం.....

ఓ రోజున... ఓ డాక్టర్... ఇదే అసుపత్రిలో...

ఓ బీద విధవరాలి దగ్గర్నించి రెండు వందల రూపాయిలు తీసుకున్నాడని, యింటి దగ్గర క్లినిక్‌కి వచ్చి ట్రీట్‌మెంట్ యిప్పించుకోమన్నాడని హాస్పిటల్‌కి వెళ్ళి ఘెరావ్ చెయ్యమని పైనుంచి ఆదేశం వచ్చింది. అంతే మందిని

పోగేశాడు. చలో! దవాఖానా! అన్నాడు.

ఆస్పత్రి ముందు ధర్నా మొదలెట్టారు.

"గవర్నమెంటు దవాఖాన అంటే ఏంది? ఫిరీగా చెయ్యాలా, పైసలడుగుతారా! ఎవలడిగిన్రు? ఏ డాక్టరు? నెలనెలా జీతాలు రావా! గవర్నమెంట్ పైసలిస్తలేదా! ఉట్టిగనే పని చేస్తున్నారా! ఏం పైసలు తీస్కోకుండా ఉన్నారా? మీ చుట్టాలకి, దోస్తులయితే మంచిగ చూస్తారు. ఆల్లెంత పైసలున్నోళ్ళయినా సరే... అట్లనే బీదోల్లని కూడా చూడాల కదా! అందరూ సమానం కదా! వారేవ్వా!... ఏం న్యాయం?

"ఓ బీదామె తన, అదీ భర్తలేని ఆమె తాన పైసలడుగుతాడా! ఎట్లడిగిండు? ఎంత ధైర్యం? ఆ డాక్టర్ని బయటికి రమ్మనండి. లంచమడుగుతాడా? ఇంటితాన మందిప్పుచ్చుకో మంటాడా! అందరూ ఒక్కటే... అన్యాయం... బీదోళ్ళంటే అంత చీపా! ఆ డాక్టరు బయటికి రావాలా! క్షమాపణలు చెప్పాలా!...

డాక్టర్! రావాలా, క్షమార్పణలు చెప్పాలా!

డాక్టర్! రావాలా, క్షమార్పణలు చెప్పాలా!

తెల్లకోటు వేసుకున్న వాళ్ళందర్ని చుట్టుముట్టేసి, గొడవ చేసారు. అప్పుడే... ఈ డాక్టరు... మల్లిఖార్జున్‌ని చూసింది అన్నాడు...

"చూడండి... మీకు కావల్సిన ఆ డాక్టరు యివ్వాళ్ళ రాలేదు. మీరు ఇలా దౌర్జన్యంగా అందర్ని చుట్టేసి లోపలికి వెళ్ళకుండా చేస్తున్నారే? అందర్ని తిడ్తున్నారే? అందర్ని తిట్టకండి. డాక్టర్లందరూ ఒకలాగే ఉండరు కదా! ఇలా పొద్దున్న వచ్చి మా పన్లన్ని పాడుచేస్తున్నారు. ఈ గొడవ ఎందుకు? ఎవరికి లాభం? చెప్పండి... ఎవరికి?...

"మీకు కావల్సిన డాక్టరు యివ్వాళ డ్యూటికి రాలేదు. మమ్మల్ని తిట్టడంలో ఏమైనా అర్థం ఉందా!

"అయినా ఎవరు అవినీతికి, అన్యాయానికి పాల్పడ్డారో వాళ్ళనిఈ

అనండి. అంతేకానీ... అందర్నీ కాదు... పేషెంట్లు వెయిట్ చేస్తుంటారు. మా పనులకి మీరంతా అడ్డు రాకండి. డాక్టర్లని... వాళ్ళ డ్యూటి వాళ్ళని చేసుకోనివ్వకుండా అడ్డు పడ్తున్నారు, గొడవ పెడ్తున్నారు.

రోగులు మా కోసం వెయిట్ చేస్తున్నారు. పొద్దున్న పొద్దున్నే ఇలా వచ్చేసి ఘెరావ్ చెయ్యడం ఏం బాగా లేదు. కొంతమంది పేషెంట్లయితే ఆస్పత్రి తెరవకుండానే లైన్లలో నుంచున్నారు. అందులో కొందరివి అర్జెంట్ కేసులు కావచ్చు. మీకు ఇలాంటి విషయాలు ఇప్పుడు తెలీదు. మీరు ఓ డాక్టరు కోసం వెయిట్ చేసినప్పుడు... అప్పుడు తెలుస్తుంది. సమయం గడిచిపోతూంటే... డాక్టరు వైద్యం సరిగ్గా సమయానికి అందకపోతే... అప్పుడు... అప్పుడు మీకు తెలుస్తుందండి. సమయానికున్న విలువ..."

ఆ రోజున ఈ డాక్టరు మాటలు చెవికెక్కలేదు.

ఆ రోజున, ఆ సమయాన రాజకీయ మత్తులో తేలుతున్నాడు. ఆ తర్వాత ఆ డాక్టరు బీద విధవరాలి దగ్గర తీసుకున్న డబ్బు యిచ్చేసాడు. వెంటనే ఆమెకు ట్రీట్‌మెంట్ చేసాడు.

పగలకొట్టిన అద్దాలు, చెల్లాచెదురైన ఫర్నిచర్, నలుగైదు గంటలు చేసిన హంగామాతో మల్లిఖార్జున్ టీవిలో, పేపర్లలో ఎక్కిపోయాడు.

డాక్టర్ని గుర్తుపట్టాకా, ఏం చెయ్యాలో, ఏం అనాలో తెలీక అర్థంకాక అయోమయంతో, బెంగగా చూసాడు ఆయనవైపు.

డాక్టరు గుర్తుపట్టారు.

"ఓ! మీరా!..." అంటూ అటూ ఇటూ చూసి పరిస్థితిని అర్థం చేసుకున్నారు. తల అడ్డంగా ఊపారు.

"ప్చ్!... వైద్యం చెయ్యడానికి వైద్యులు లేరు. అంతా సమ్మెలో ఉన్నారు..."

"అట్లనొద్దు..." అంటూ భాగ్యలక్ష్మి ఏడుస్తూంది.

"కాదమ్మా... డాక్టర్లంతా సమ్మె చేస్తున్నారు. ఎవరూ పని చేయకూడదు. సమ్మెకి సపోర్ట్ చెయ్యాలి కదా! వ్యతిరేకంగా నేనెలా వైద్యం చెయ్యగలను?

చెప్పండి. ఏం సార్ ఏమంటారు ఈ సమ్మెల సంగతి మీకు బాగా తెలుసును కదండి! మరి నేనెందుకు ఈ వేళప్పుడు, ఇక్కడ ఉన్నానని అనుకుంటారేమో కదూ!... నేను వాళ్ళు చేసే సమ్మెలో లేను. ఎంతోమంది రోగులున్నారు ఇక్కడ. అందరూ సమ్మె స్ట్రయిక్ అంటూ వెళ్ళిపోతే... ఇక్కడ ఏమైనా జరగరానిది జరిగితే... ఇప్పుడు చెప్పండి మా వాళ్ళ సమ్మెకి వ్యతిరేకంగా ఉన్న నేను ద్రోహినవుతానా! సమాజ సేవకుడినా! ఎవరు ద్రోహులు? దేశానికి ప్రజానీకానికి నష్టం తెచ్చేవారా! సమాజానికి పనికి వచ్చేవారా!"

నిశ్శబ్ధంగా తల వంచుకున్నాడు మల్లికార్జున్.

"ఆ రోజున నేనన్నది గుర్తుందా! ఎవరు దోషులో, ఎవరు అవినీతిపరులో వాళ్ళని నిలదీయండి. అమాయకుల్ని బలిచెయ్యకండి. ఆ రోజున అద్దాలు పగలకొట్టి, ఫర్నిచర్ పాడుచేసి, మా విధులకి వెళ్ళనివ్వకుండా చేసారు. సీరియస్ కేసుల్ని చూడనివ్వలేదు. ఇప్పుడు నేనొక్కడినే మీ అబ్బాయికేం చెయ్యలేను... మీరు వెంటనే ఏదో ఓ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి... తొందరగా..."

"అట్లనొద్దు డాక్టరూ..."

"నేనొక్కడినే ఏం చెయ్యలేను, ఇంకొక్క డాక్టరున్నా ఆఖరికి అనుభవంగల సిస్టరున్నా సరే... సారీ... ఫ్చ్... ఎవరూ లేరు..."

మరో ఐదు నిమిషాల్లో సైరన్ మోగించుకుంటూ అంబులెన్స్, మల్లిఖార్జున్ కారుని రాజు, కవిత కారుని ఆమె డ్రైవర్, ఒకదాని వెనక్కాల ఒకటి రోడ్డెక్కాయి.

"అన్నా! ఏం కాదు... అర్ధగంటలో బంజారాలో ఉంటాములే, ఎప్పుడయింది యాక్సిడెంట్!" అని కవిత మల్లిఖార్జున్‌ని అడిగింది.

"కాలేజికి పోతున్నప్పుడు ఎనిమిదిన్నరయ్యి ఉండచ్చు."

సడన్‌గా అంబులెన్స్ ఆగింది.

తలతిప్పి చూసారు అందరు.

చౌరస్తా దగ్గర విద్యార్ధులు గుంపులు. ఎవరిదో ఓ దిష్టి బొమ్మని తగలబెడ్తున్నారు.

మీడియావాళ్ళు, లీడర్లు, విద్యార్థులు, అరుపులు... వాళ్ళ మధ్యలోంచి అంబులెన్స్ ఆగి ఆగి వెళ్తోంది... ఈ లోపలే ఆ గొడవ దేనిగురించో తెలిసింది. తెలిసాకా గుండెల్లో సన్నగా నొప్పి. అర్థం కాని నొప్పి. ఎవరో ఓ స్టూడెంట్ ఏదో హాస్టల్లో సూసైడ్ చేసుకున్నాడుట! ఆ కాలేజి ప్రిన్సిపాల్ దిష్టిబొమ్మని తగలబెట్టి రాస్తారోకో చేస్తున్నారు. అయితేనేం ఓ వారగా, మెల్లిగా వాహనాలు ఒకదాని వెనక ఒకటి వెళ్తున్నాయి.

"మోటార్ సైకిల్ బాగా జోరుగా తీస్కపోతడు. నెత్తీ నోరు కొట్టుకుని రోజూ చెప్తానే ఉంటి, యినలేదే!..." ఏడుస్తూ అంది భాగ్యలక్ష్మి కవితతో.

"ఈ కాలం పిల్లలే అట్లున్నారు. చెప్తే మనమంతా పిచ్చోళ్ళలాగా కనిపిస్తాము.

నేనెప్పుడయినా, ఏమన్న చెప్పనీకిపోతే "డాడీ, నీ లెక్చర్లు బయటోళ్ళకి, నాక్కాదు." అని ఎళ్లిపోయెటోడు..." బాధగా నీళ్ళు నిండిన కళ్ళతో కొడుకుని చూసాడు.

"పొద్దుగాల కారు తీస్కబోతానన్నాడు, నువ్వే యియ్యలేదు. కార్ల పోయిన యిట్లా కాకుండుంటే..." అంటూ ఏడుస్తూ కొడుకు చెయ్యిని నిమిరింది.

"యాక్సిడెంట్ అయ్యేదుంటే, విమానంలో పోయిన అయితది. కార్లలో పోయిన అయితది. అట్లా రాసిపెట్టి ఉండె, ఊకో అక్కా. ఏంగాదు, బాబుకేం కాదు. పైన దేముదున్నాడు..." అంటూ ఊరడించాడు. దేవుడిమీద భారం పెట్టేసారంతా.

కవిత చిన్న చిన్నగా ఫస్టెయిడ్ చేస్తూ అక్కడే కూచుని, కారిపోతున్న రక్తాన్ని తుడుస్తోంది.

కవిత కార్లో మిగిలిన వాళ్ళు వస్తున్నారు.

అంబులెన్స్ ఆగిపోయింది.

"మల్ల ఏంది? జల్దీ తీస్కపో" అంటూ ఇనప కటకటాల్లోంచి డ్రైవరు వైపు చూసాడు.

"ట్రాఫిక్ జాం అయింది. సార్" ఎప్పటికీ క్లియర్ కాకపోవడంతో... అంతా బాధతో విసుక్కుంటూ అంబులెన్స్ దిగాడు. అటూ ఇటూ చూసాడు. కనుచూపువరకూ కార్లు, బస్సులు, ఆటోలు ఆగి ఉన్నాయి.

స్కూటర్లు మోటారు సైకిళ్ళు నడిపించుకుంటూ ఓ వారగా వెళ్తున్న వాళ్ళ దగ్గరకెళ్ళాడు. సంగతేంటో కనుక్కుందామని.

"ఏమాయే!"

"ధరలు పెరిగాయట. అన్ని ధరలు తగ్గించమని రాస్తారోకో ఒకగంట చేస్తారంట. వాళ్ళు చేసేది ఒక గంటేకానీ, ఈ ట్రాఫిక్ ఓ కిలోమీటరు వరకూ ఉంది. క్లియర్ అవడానికి రెండుగంటలు మినిమమ్ పడ్తుంది." అంటూ వెళ్ళిపోయాడు.

"నీకు తెలీదా అన్నా!" అంది కవిత.

మనసులో ఓ మూల సన్నటిపోటు, తెలుసు. ఈ బాధలో మర్చిపోయాడు.

"ఈ బంద్‌లేమిటో, ఈ రస్తారోకేలేమిటో... ఏవీ అర్థం కాదు. ఈ నాయకులకి పనిలేదు. ప్రజల్ని ఎలా ఏడిపించాలా అని చూస్తారేకాని... వాళ్ళ మంచి చెడ్డల్ని ఏం చూడరు. ఏం శతృత్వం పెట్టుకున్నారో తెలీదు కనీ, ఓసారి ఓపార్టీ, మరోసారి మరో పార్టీ..... చంపుకు తింటున్నారు.

టైమ్ విలువ తెలీదు. ఒక్కో నిమిషం ఎంత ప్రిషియస్!..."

మాటలు ఈటెల్లాగా గుచ్చుకున్నాయి. మల్లిఖార్జున్‌కి.

మరో రోజు మరో సమయం అయితే, అందర్నీ కూర్చోబెట్టి ఓ పెద్ద లెక్చరిచ్చేవాడు.

నిస్సహాయంగా డ్రైవరు వద్దకెళ్ళాడు.

"పోనీ, మరోవైపునుంచి తీసుకెళ్ళకూడదా!"

"ఎటువైపునుండి పోలేం సార్! పేరెడ్ గ్రౌండ్స్‌నుంచి వెళ్ళేందుకు అస్సలు లేదు. అసలు యిప్పుడు తప్పుకోడానికే రానంత మధ్యలో ఉన్నాము.?"

నిజమే ప్రత్యేక రాష్ట్రం కావాలన్నా పార్టీ బహిరంగసభ. వేరే రాష్ట్రాలనుంచి వస్తున్నారని, ఆ మద్దతుదారులు చాలామంది ఉన్నారని, ఆ బహిరంగ సభలో పాల్గొంటున్నారని, ట్రాఫిక్‌ని డైవర్ట్ చేస్తున్నారు.

ఒక్కోక్షణం ఎలా గడుస్తుందో..... తల్చుకుని భాగ్యలక్ష్మి ఏడ్చేస్తోంది.

మల్లిఖార్జున్‌కి తాము యిరుక్కున్నది ట్రాఫిక్ జాంలో కాదు. ఓ పద్మవ్యూహంలో అనిపించింది.

బయటికి రావడం అసంభవంలా అనిపించింది.

ఎలా బయటికి రావడం?

అందరి మొహాల్లో చిరాకు, వ్యథ, కోపం... బాధ... దుఃఖం...చింత, నిస్సహాయం.

నిన్నటివరకు తను కూడా ఇలాంటి వాటిని నిర్విఘ్నంగా సాగించాడు. స్వార్థం కోసం, డబ్బు కోసం, తిండి కోసం.

ఆ రోజున తన శక్తిమీద అంతగర్వం ఉండేది.

ఇప్పుడు బేలగా, అసహాయంగా సముద్రంలా మారిన వాహనాలకేసి చూస్తున్నాడు.

ఇప్పుడు ఏం జరుగుతుంది..... తనకు తానే ప్రశ్నించుకున్నాడు. ఈ రాస్తారోకో ఎంతసేపు!

ఇది చేయించేవాళ్ళు యింతసేపే చెయ్యాలని అనుకోరుకదా! ప్రజల యిబ్బంది గుర్తించరు కదా!

ఇది వాహనాలు మాత్రమే ఆగిపోవడమా! మరి దైనందిన కార్యక్రమాలు ఆగిపోవడమా! దేన్ని ఆపేశారు? వాహనాల్నా? మనుషుల్నా? ఆలోచనలనా? ఇది వాహనాలు మాత్రమే ఆగిపోవడమా! దేశ ప్రగతా! దేశం కూడానా, అభివృద్ధి కూడానా! ఇది పురోగతా? తిరోగతా?

ప్రతీ నిమిషం భారంగా వెళ్తోంది మల్లిఖార్జున్‌కి.

ఈ బంద్‌లవల్ల, రాస్తారోకోలవల్ల నడిరోడ్లో ఉన్నవాళ్ళకి ఒక్కొక్క క్షణం

ఎలా గడుస్తుందో యిప్పుడు అర్థం అవుతుంది.

సమయం బహుమూల్యం... చాలా ఆలస్యంగా అనుభవంలోకి వచ్చింది.

తెరిచి ఉన్న తలుపులోంచి లోపలికి చూసాడు. ఏడుస్తున్న భాగ్యలక్ష్మిని పట్టుకుని ఓదారుస్తోంది. పల్స్ చూస్తోంది కవిత. తల అడ్డంగా ఊపింది.

"చూడు బాగా చూడు కవితా! అట్లనొద్దు......"

శిలలా అయిపోయాడు. అర్థం అయింది.

గుండె ఆగినట్లుగా అయింది.

నిశ్చలంగా ఆగీనట్లుగార అయింది.

ఈ బంద్‌లు, రాస్తారోకోలు, జాంలు, హర్తాళ్ళు, రాజకీయ నాయకుల పనిముట్లు ఎంత భయంకరమైనవో... ఇన్ని రోజులు ఇవి తాను వాడాడా! లోపల కూచుని తలుపేసి ఏడవడం మొదలెట్టాడు.

చలనం వచ్చింది. దారి యిచ్చారు అంబులెన్స్‌కి.

జనవాహిని... కాదు వాహనాల సముద్రంలోంచి... శోక సముద్రంలో మునిగిపోయిన వాళ్ళని వాళ్ళని వెనక్కి దారి మళ్ళించింది... అంబులెన్స్.

లోకం ముందుకు పోతూంటే... దేశ ఉన్నతి కోసం... సమాజ శ్రేయస్సు కోసం చేసిన ఈ ప్రయత్నంలో ఎవరు బలి అయ్యారు? తన కొడుకు... ఏం పోయింది? ఎవరు నష్టపోయారు? ఎవరికెంత లాభం? ఇంకా ఇలాంటి పరిస్థితి నెదుర్కున్న వారెందరో? ఆలోచించలేని స్థితిలో తిమ్మిరెక్కిపోయిన మెదడుతో మంచు దిమ్మలమధ్య నొక్కుకుపోతున్నట్లుగా ఉన్న ఆలోచనలతో శూన్యంలోకి చూస్తుండిపోయాడు మల్లిఖార్జున్.

(2005 ఆగష్టు బాపు మాస పత్రిక)